క్లుప్తంగా

కొత్తగూడెం ఏరియాలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఆగస్టు మాసానికి నిర్దేశించిన 9,58,173 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 9,65,500 టన్నులు (101 శాతం) నమోదైంది. ఏరియాలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో 9,29,808 టన్నులకు 9,52,995 టన్నులు (102శాతం) సాధించగా, పీవీకే-5 ఇంక్లైన్‌లో 28,365 టన్నులకు 12,505 టన్నుల(44శాతం) ఉత్పత్తి మాత్రమే నమోదైంది. ఇక ఆగస్టులో 9,65,500 టన్నుల బొగ్గు రవాణా చేయడం ద్వారా ఏరియా సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. అలాగే, ఇల్లెందు ఏరియాలో 2,48,640 టన్నుల లక్ష్యానికి 3,18,200 (128 శాతం) ఉత్పత్తి నమోదైందని అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న స్వాతిబిందు

జూలూరుపాడు: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మరో నాలుగు రోజుల వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ఇళ్లలో నుంచి బయట రావొద్దన్నారు. వాగులు, వంకలు ప్రవహించే సమయంలో దాటే ప్రయత్నం చేయవద్దని చెప్పారు. గ్రామాల్లో మట్టి గోడల ఇళ్లు, పూరిగుడిసెల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సురక్షితమైన ప్రాంతానికి చేరుకోవాలని సూచించారు.

గణేష్ మండప కమిటీలతో డీఎస్పీ సమావేశం

కొత్తగూడెంటౌన్: రానున్న వినాయక చవితి నవరాత్రుల మహోత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శనివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆలయ కమిటీలు, మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతీ మండపానికి అనుమతులు తప్పనిసరి అని మార్గదర్శకాలను వివరించారు. అనుమతుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల అన్నిరకాల అనుమతులు పోలీసుల నుంచి పూర్తి సమాచారం, ఇతర సౌకర్యాలను అందుతాయని తెలిపారు. ప్రతీ మండపం వద్ద వలంటీర్ తప్పనిసరిగా ఉండాలని, పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. డీజేలు, మైకులకు అనుమతులు లేవని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐలు కరుణాకర్, శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడిగా కేవీ రంగాకిరణ్ ఎన్నికయ్యారు. శనివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా గణేష్ ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంచర్ల చంద్రశేఖర్, వందనపు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా దారా రమేష్, ఉపాధ్యక్షులుగా యర్ర కామేష్, లక్ష్మణ్, కూర శ్రీధర్, గొడుగు శ్రీధర్, కాసుల వెంకట్‌లను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రంగాకిరణ్ మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ నుంచి 17 వరకు గణేష్ మండపాలు నిర్వహించే కమిటీలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెరుగు చింతేశ్వరరావు, యాకయ్య, విజయలక్ష్మి, సుజాత, సీతా, గడిదాసి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

బీసీ గణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించండి

ఇల్లెందురూరల్: బీసీ గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షురాలు కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పెద్దలు చెప్పినట్లుగా తక్షణం బీసీ గణన చేపట్టి బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ గణన లక్ష్యంగా ఆందోళన చేస్తున్న ఆజాద్ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు సురేంద్రరావు, అశోక్, అశ్విన్ పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు వితరణ

జూలూరుపాడు: తాగునీటి సమస్య పరిష్కారం కోసం జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన మందా పుల్లయ్య శనివారం విద్యుత్ మోటారును పంచాయతీ సెక్రెటరీ హరిబాబుకు అప్పగించారు. కొంతకాలంగా చేతి పంపులు మూలనపడటంతో కాలనీవాసులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న పుల్లయ్య విద్యుత్ మోటారును వితరణ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బడుగు వీరస్వామి, కళ్లోజి వెంకట్, దినేష్, మందా రంజిత్ కుమార్, పసుపులేటి పవన్ పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాలు ముస్తాబు

- ఇప్పటికే మొదలైన ప్రతిమల అమ్మకం
- రాజస్తాన్ వాసులకు ఉపాధి
- ఒక్కో విగ్రహం ధర రూ.2 వేల నుంచి రూ.35 వేలకు పైగా..
- కొనుగోలుదారులతో సందడి..


విగ్రహాలను కొనుగోలు చేస్తున్న యువకులు

సండే స్పెషల్

కొత్తగూడెంటౌన్: గణేషుడొచ్చాడు... రోడ్లపై రకరకాల చిన్నాపెద్ద వినాయక విగ్రహాలను అమ్మకాలకు ఉంచడంతో వచ్చిపోయేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొంతమంది అడ్వాన్స్ చెల్లించి తమకు కావలసిన విధంగా తయారు చేయించుకుంటున్నారు. అదేవిధంగా మండపాల్లో కొలువు ఉంచేందుకు పలువురు కమిటీ సభ్యులు విగ్రహాలను సెలక్ట్ చేసుకుంటున్నారు. గణేష్ నవరాత్రులు 7వ తేదీ నుంచి మొదలు కానుండంతో విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, చుంచుపల్లి తండాల్లోని పలుచోట్ల విగ్రహాలను అమ్మకాలు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారులు ఆరు నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాలను తయారు చేసి రకరకాల రంగులద్ది విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. ఆర్డర్ చేసిన విగ్రహాలను భక్తులు కోరిన విధంగా తయారు చేస్తున్నారు. రామాంజీ అనే వ్యాపారస్తుడు రాజస్థాన్‌కు చెందిన 10 కుటుంబాలను ఇక్కడికి తీసుకొచ్చి ఉపాధిని కల్పిస్తూ విగ్రహాలను తయారు చేయించి అమ్మకాలు చేస్తున్నాడు. ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేల వేతనంతో పాటు భోజనం, వసతి కల్పిస్తున్నాడు.

సైజులను బట్టి అమ్మకాలు...

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో విగ్రహాలను 2 అడుగుల ఎత్తు నుంచి 15, 20 అడుగులకు పైగా వినాయక విగ్రహాలను ఆకట్టుకునే విధంగా తయారు చేశారు. ధర రూ.2 వేల నుంచి రూ.5 వేలు, 10 వేలు, 20వేలు, 25 వేలు, రూ.35 వేలకు పైగా ధరలలో అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా భక్తులు కోరిన ఎత్తులో కూడా తయారు చేసి అమ్ముతున్నారు.

ముందుగానే ఆర్డర్లు..

చవితికి 10 రోజుల ముందే విగ్రహాలను తమకు కావాల్సిన విధంగా తయారు చేయించుకుని నవరాత్రుల ఉత్సవాల్లో ప్రతిష్ఠించేందుకు కొనుగోలు చేస్తారు. అందుకు గాను విగ్రహం విలువను బట్టి అడ్వాన్స్ చెల్లించి ఆర్డర్లు సైతం ఇస్తున్నారు. ఈసారి పండుగకు గతంలో కంటే ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయని వ్యాపారులు పేర్కొన్నారు.


రంగులద్దుతున్న కార్మికుడు

భక్తుల ఇష్టప్రకారం తయారు చేస్తాం..



వినాయక చవితి పండుగకు ఆరు నెలల ముందే ఇక్కడికి వచ్చి విగ్రహాలు తయారు చేస్తాం. రోజూ రకరకాల ఆర్డర్లు వస్తుంటాయి. నెలకు మాకు రూ.15 వేలు జీతం ఇస్తారు. చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల వరకు భక్తుల ఇష్టపకారం తయారు చేస్తాం. - సంజీవ్‌కుమార్, విగ్రహాల తయారీదారుడు, రాజస్తాన్

ఆరునెలల ముందే పని ప్రారంభిస్తాం..



ముందస్తుగా భక్తులు తమకు కావాల్సిన ధర, రూపంలో ఆర్డర్లు ఇస్తుంటారు. దానికి తగ్గట్టుగా మా ఓనరు చెప్పినట్టు మేము విగ్రహాలను తయారు చేస్తాం. ఆరు నెలల ముందు నుంచే ఇక్కడ పని చేస్తున్నా. రాజస్తాన్ నుంచి 10 కుటుంబాల వారు ఇక్కడ పని చేస్తున్నారు. - కైలాష్ కుమార్ విగ్రహాల వ్యాపారి, రాజస్తాన్

ఏటా విగ్రహాలు అమ్ముతాం..



ప్రతీ ఏటా ఆరు నెలల ముందు నుంచే రాజస్తాన్ నుంచి కార్మికులను తీసుకొచ్చి విగ్రహాలను తయారు చేస్తాం. ఈ ఏడాది 10 కుటుంబాలను తీసుకొచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నాం. నెలకు జీతంతోపాటు, ఉచిత భోజన, వసతిని కూడా కల్పిస్తున్నాం. ఇక్కడ విగ్రహాలకు గిరాకీ బాగానే ఉంటుంది. - రంజిత, వ్యాపారస్తుడు, రాజస్తాన్

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి..


మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు జ్వరాలు, అంటురోగాల బారిన పడుతున్నారని, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీరోజు ఇల్లెందు ఆస్పత్రికి 800 మంది రోగులు వస్తున్నారని, మందులు, బెడ్లు లేక తీవ్ర పడుతున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు పరికరాలు అందుబాటులో లేక ప్రైవేట్ వారిని ఆశ్రయిస్తున్నారని చెప్పారు. ఎస్‌ఏ నబీ, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, సర్వన్‌కుమార్, ఖాదర్, సుల్తానా, లక్ష్మి, మహమూద్, నాగరాజు పాల్గొన్నారు.

తప్పులు సవరించుకోండి..

సుజాతనగర్: ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాల్లో పేరు మార్పుల కారణంగా రుణమాఫీ కాని రైతులు బ్యాంక్‌కు వెళ్లి సవరణలు చేసుకోవాలని ఏఓ జి.నర్మద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరణల నిమిత్తం బ్యాంకులో ఉండే నోడల్ అధికారిని సంప్రదించాలని సూచించారు.

వైరా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ కోరారు. శనివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన రాందాస్ నాయక్‌కు అవకాశం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో భావ్‌సింగ్, నాగరాజు, రాంబాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో వైద్యశిబిరాలు

టేకులపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకులం, కోయగూడెం ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. చికిత్స అందించి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మార్కెట్‌లోకి పల్సర్ న్యూ మోడల్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని సాయి అంజనా బజాజ్ మోటార్స్ షోరూమ్‌లో బజాజ్ పల్సర్ ఎస్ఎస్ 400 మోటర్ సైకిల్‌ను కొత్తగూడెం టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్ఎస్ 400 బైక్ స్పెషల్‌గా యువతను ఆకర్షించే విధంగా తయారు చేసినట్లు తెలిపారు. వాహనం ఆధునికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం యాజమాని ఆకుల శ్రీనివాస్, పాల్వంచకు చెందిన మురళీకృష్ణ, మేనేజర్ వనజ, వర్క్స్ మేనేజర్ అనిల్, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయడమే కాకుండా రైతు రుణాలను మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చర్ల రంగయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ఈనెల 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనుండగా వాల్‌పోస్టర్లను కొత్తగూడెంలోని కార్యాలయంలో శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఆందోళనకు రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముత్త భిక్షం, నాయిని రాజు, అమర్లపూడి రాము, బుర్రా వెంకన్న, కల్లూరి కిషోర్, నూప భాస్కర్, గోకినపల్లి ప్రభాకర్, లింగ, బి.ధర్మ పాల్గొన్నారు.

ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయండి



ప్రదర్శన నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఇల్లెందురూరల్: ఇఫ్టూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పెంకు పరిశ్రమలలో ఇఫ్టూ నేతలు శనివారం ప్రచారం చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నేత రాంసింగ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ నిర్ణయాలు తీసుకుంటోందని, నాలుగు నల్లచట్టాలను అమలు చేస్తూ కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మికులను సమీకరించి ఉద్యమాలు నిర్మించేందుకు జాతీయ మహాసభలలో నేతలు దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాంబాబు, రాజమ్మ, బజారి పాల్గొన్నారు.

ఎస్సీలకు ప్రాధాన్యం కల్పించాలి


తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు అభివృద్ధి, అధికారంలో ప్రాధాన్యం కల్పించాలని షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ గుగ్గిళ్ల పీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జేఏసీ ఆధ్వర్యంలో టేకులపల్లి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంతంలో తొలగించిన స్థానిక ఎస్సీ కులాల రిజర్వేషన్లను తిరిగి అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎనగంటి కృపాకర్, కన్నం చంద్రయ్య, చలగొల్ల వెంకన్న, ఈదురు సైదులు, గుగ్గిళ్ల వినీత్, మెంతిని ప్రభాకర్, మీసాల రాములు, కీసర సమ్మయ్య, కుంపటి పిలిప్ పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టం చేస్తాం..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంతో పాటు, రోడ్లు, డ్రెయినేజీల వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో రూ.1.83 కోట్లతో పలు సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు కూనంనేని శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. వివిధ పథకాలు, గ్రాంట్ల ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని, అధికార యంత్రాంగం నిత్యం పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ డీఈ స్వరూపరాణి, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, రంగారావు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, మనోహర్, శాంతివర్ధన్, మహేశ్, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు కర్మాగారాలు నిర్మించండి..

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో రెండు కర్మాగారాలను నిర్మించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాల్వంచలో గతంలో ఉన్న పాత ప్లాంట్‌ను తొలగించారని, దీనివల్ల ఆ ప్రాంత అభివృద్ధి కుంటుపడిపోయిందన్నారు. తిరిగి అక్కడి భౌగోళిక వసతులు వినియోగించుకుని కర్మాగారాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కేటీపీఎస్ పరిధిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను తొలగించి నూతన భవనాలను నిర్మించాలన్నారు. ఇందుకు సీఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యంగా పోరాటాలు


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: పాత పెన్షన్ విధానం సాధనే లక్ష్యంగా టీజీఈఏజేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం కుంటల్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు ప్లకార్డులు పట్టుకుని సీపీఎస్, యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు.. అంటూ నినాదాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సెప్టెంబర్ ఒకటి బ్లాక్ డే అని తెలిపారు. ఆదివారం మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబర్1, 2004 తర్వాత ఉద్యోగం వచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు బ్లాక్ డే గా పరిగణించాలని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చినట్టే వచ్చి మరోకొత్త విధానం యూపీఎస్‌ను తెరమీదకు తీసుక రావడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోగ రవి, పూల్ సింగ్, దేవ్‌సింగ్, రాంబాబు, భీముడు, చందులాల్, రమేష్, నరేష్, సుశీల, కళ్యాణి, రామకోటేశ్వరి, రామారాజు, రామరావు, మంగ్‌త్యా తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని విస్తరించాలి


మాణిక్యారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏజెన్సీలోని అన్ని గ్రామాలకు విస్తరించాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ అనుబంధ పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాలలో ప్రదర్శన నిర్వహించి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ మాట్లాడుతూ.. ఇల్లెందులో బస్‌డిపో ఏర్పాటు చేశారే తప్ప ఏ గ్రామానికి డా బస్సు సౌకర్యాన్ని కల్పించలేదని వాపోయారు. గతంలో రహదారులు అధ్వానంగా ఉన్నప్పుడు కూడా కొత్తగూడెం డిపో నుంచి మాణిక్యారం, బోయితండా గ్రామ పంచాయతీలకు పల్లెవెలుగు బస్సులు నడిచేవని గుర్తుచేశారు. ప్రస్తుతం రహదారులు మెరుగుపడినా బస్సు సౌకర్యం కల్పించడంలో అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. కేవలం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పల్లె ప్రజలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నట్లు చెప్పారు. పల్లె ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే వరకు ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సావిత్రి, కోరం ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన


సమస్యలు వింటున్న డీఎం దేవేందర్‌గౌడ్

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ ప్రోగ్రామ్‌కు ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. ప్రయాణికులు నేరుగా తమ సమస్యలను డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్‌కు తెలిపారు. కొత్తగూడెం నుంచి ఏలూరుకు వయా దమ్మపేట మీదుగా బస్సు నడపాలని, కోయగూడేనికి బస్సు నడపాలని, పాలిటెక్నిక్ కాలేజ్ వెళ్లే విద్యార్థుల కోసం బేతనియా చర్చ్ దగ్గర బస్సు ఆపాలని, బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలను ఎక్కువసేపు ఆపకుండా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు హైర్ బస్ డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఎం దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ హైర్ బస్ డ్రైవర్లకు సెల్ఫోన్ మాట్లాడొద్దని, అందరు డ్రైవర్లకు రిక్వెస్ట్ స్టేజీల దగ్గర బస్సు ఆపేలా సూచనలు ఇస్తామన్నారు. మిగతా ఫిర్యాదులు, సలహాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

జూలూరుపాడు: కొత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు శనివారం మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. కొత్తూరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు చెప్పారు. దోమతో ప్రజలు విషజ్వరాలతో మంచం పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ సన్మానం


కోయగూడెంలో శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 35 ఏళ్లు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి శనివారం ఉద్యోగ విరమణ చేసిన జీఎం పర్సనల్ (సెక్యూరిటీ అండ్ ఐఆర్‌పీఎం) బీఆర్ దీక్షితులును పలువురు సన్మానించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం హెచ్‌ఆర్‌డీ భవన్‌లో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ ఆధ్వర్యాన సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. వివిధ విభాగాల అధికారులు కవితానాయుడు, కోడూరి శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, ఎస్.వరప్రసాదరావు, పి.వేణుగోపాలరావు, వైవీఎల్.వరప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, బి.రాజ్‌గోపాల్, ముకుంద సత్యనారాయణ, సీవీఎస్.మూర్తి, ఎల్.తిరుపతి పాల్గొన్నారు. అలాగే, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన దీక్షితులను సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావుతో పాటు ఎస్.కుమార్, గోనే శ్రీకాంత్, అజయ్‌కుమార్, కలవల చంద్రశేఖర్‌రావు, బండెల విజేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు...

సుజాతనగర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం చిట్లూరి వీరభద్రరావును ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖకు చెందిన పలువురు హాజరై వీరభద్రరావు, మృధుల దంపతులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏసీజీఈ మాధవరావు, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, పీజీ హెచ్‌ఎం జిల్లా సెక్రటరీ ప్రకాశ్, ఎంఈఓ జుంకీలాల్, నాయకులు నాగా సీతారాములు, మండె వీరహనుమంతరావు, చింతలపూడి రాజశేఖర్, లింగం పిచ్చిరెడ్డి, కొమారి హనుమంతరావు పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసిన సీహెచ్ శ్రీనివాస్‌రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు టి.రవీందర్, మండల అధ్యక్షుడు జి.మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్ ఉమ దంపతులు బి.రమేష్ బాబు, డి.పన్నాలాల్, బాబా షఫీఉద్దీన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొమ్మనపల్లి కాంప్లెక్స్ పరిధిలో..

బొమ్మనపల్లి కాంప్లెక్స్ పరిధిలో పలువురు ఉపాధ్యాయులు ఇటీవల పదోన్నతి, బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లారు. వారిని కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగీలాల్, కార్యదర్శి వి.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.